క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు షురూ



సాక్షి ఎఫెక్ట్..

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'పల్లెలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తొగర్రాయి, దుగ్గొండి, మహ్మదాపురం, గిర్నిబావి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. తొగర్రాయిలో తాగునీటిలో మురుగు కలుస్తున్న క్రమంలో గేట్‌వాల్వ్‌లకు పంచాయతీ కార్యదర్శి మరమ్మతు చేయించారు. అలాగే ఎస్సీ కాలనీలో మురుగు కాల్వను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ గౌడ్, గ్రామ ప్రత్యేక అధికారి శారద, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సైకో చర్యలతో కలకలం



నెక్కొండ : మండల కేంద్రంలో బీహార్‌కు చెందిన ఓ సైకో తన చర్యలతో కలకలం సృష్టించాడు. రైలు దిగిన సదరు సైకో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. మత్తు పదార్థాల సేవించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సైకో వీరంగం సృష్టిస్తుండడంతో కార్యాలయ సిబ్బంది డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని సదరు సైకోను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ అనంతరం సదరు వ్యక్తిని రైలు ఎక్కించి బిహార్‌కు పంపించారు.

నేడు సమావేశం

నర్సంపేట రూరల్ : 'రైతాంగ ఉద్యమాలు–ఓంకార్ పాత్ర' అంశంపై నేడు (మంగళవారం) నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో ఎంసీపీఐ(యూ), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంతోపాటు దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను కోరారు.

పరామర్శ



నర్సంపేట : పట్టణానికి చెందిన ఠాకూర్ బంగారమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, సీనియర్ నాయకుడు కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల్ల రాంచందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, ఠాకూర్ విజయ్‌సింగ్, యువ మోర్చా మాజీ నియోజకవర్గ కన్వీనర్ జూలూరు మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

బురహాన్‌పల్లిలో..

రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సూర బక్కయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం పరామర్శించారు. తొలుత మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన ముదిరాజ్ కుల పెద్దమనిషి బుసాని నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం రూ.8 వేల సాయం అందజేశారు. తొలుత నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాట్ల భద్రయ్య, ఓడేటి తిరుపతిరెడ్డి, తుమ్మలపెల్లి మహేందర్, సదానందం, యార శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మీదే విద్యుత్ తీగలు

● పొంచి ఉన్న ప్రమాదం

నల్లబెల్లి : ఇళ్ల మీదుగానే 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. కాలనీవాసులకు ప్రమాదం పొంచి ఉన్నా ఆ శాఖ అధికారులు సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో కొన్నేళ్లుగా విద్యుత్ తీగలు ఇళ్లపై చేతికి అందే ఎత్తులో ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దండు మరియమ్మ, దండు సదయ్య, నాగెల్లి సౌందర్యలకు చెందిన ఇళ్ల మీద 11 కేజీ విద్యుత్ తీగలున్నాయి. సదరు విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు బాధిత కుటుంబాలు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదని విమర్శలున్నాయి.



ఇంటిపైన వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ప్రమాదంతో బెంబేలు

ఇళ్ల మీద 11 కేవీ విద్యుత్ వైర్లు ఉండడంతో ఎప్పుడు ప్రమాదం వాటిల్లుతుందోనని కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. విద్యుత్ వైర్లను ఇళ్లకు దూరం జరపడంతోపాటు వాటికి రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాగా తీగలను తొలగించే దిశగా ఉన్నతాధికారులకు అధికారులు ప్రతిపాదనలు పంపిం,గా ఉన్నతాధికారులు ఆమోదించినా పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి



ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలతో మాకు ప్రమాదం పొంచి ఉంది. తీగల కింద బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. గాలివాన వీస్తే రాత్రంతా కంటి మీద కునుకు ఉండడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను తొలగించి సమస్య పరిష్కరించాలి.

– దండు మరియమ్మ, కాలనీవాసి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



కొంకపాకలో ఫరీదా బేగానికి గిడ్డంగిని అప్పగిస్తున్న కృష్ణవేణి, తదితరులు

● ఈజీఎస్ ఏపీడీ కృష్ణవేణి

పర్వతగిరి : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈజీఎస్ ఏపీడీ కృష్ణవేణి, మార్కెటింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎం.ఎల్లేష్ తెలిపారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ ఫేస్–3లో భాగంగా మండలంలోని కొంకపాకలో నిర్మించిన 3 వేల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయగల సామర్థ్యంతో నిర్మించిన గిడ్డంగిని మదర్ థెరిస్సా మండల సమాఖ్య కోశాధికారి ఫరీదా బేగంకు ఏపీడీ కృష్ణవేణి, ఎల్లేష్ సోమవారం అప్పగించారు. అలాగే ఏనుగల్‌లో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల నిల్వ చేయగల సామర్థ్యం కలిగిన గిడ్డంగిని పర్వతగిరికి చెందిన సూర్యోదయ ఎఫ్‌పీసీ అధ్యక్షురాలు కవితకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఎంపీఈఓ శేషుకుమార్, ఎఫ్‌పీసీ వైస్ చైర్మన్ సరిత, సీసీలు సుధాకర్, రవీందర్‌రాజు, ఎఫ్‌పీసీ సీఈఓ శ్రీనివాస్, ఎంఎస్ సిబ్బంది రాధిక, అరుణ, వీఓఏలు విజేందర్, రాజు, సంధ్య, రమేశ్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్లు మహేందర్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు స్క్రీనింగ్‌తో టీబీ కట్టడి



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ అఖిల్

● పల్లె దవాఖాన వైద్యాధికారి నిఖిల్

వర్ధన్నపేట : ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా టీబీ వ్యాధిని కట్టడి చేయొచ్చని పల్లె దవాఖాన వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా మండలంలోని ఉప్పరపల్లిలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ మాట్లాడారు. పరీక్షలు నిర్వహించగా 65 మందిని ప్రాథమిక టీబీ అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. వారి నమూనాలను పరీక్షలకు పంపించడంతోపాటు వారిలో 38 మందిని ఎక్స్‌రే కోసం సీహెచ్‌సీకి పంపించనున్నట్లు చెప్పారు. టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని తెలిపారు. సకాలంలో గుర్తిస్తే మందులతో కట్టడి చేయొచ్చని తెలిపారు. శిబిరంలో సీహెచ్‌ఓ జ్ఞాన సుందరి, పీహెచ్‌ఎన్ కమల గ్రేస్, సూపర్‌వైజర్ రాజు, హెల్త్ అసిస్టెంట్ మథ్యూస్, స్వర్ణలత, ఎస్టీఎల్ఎస్ రంజిత్, శ్రీనివాస్, ఏఎన్ఎం రాణి, ఆశవర్కర్లు చైతన్య, సంధ్య, రమ్య, మాధవి, రేణుక, రజియా, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



సంగెం : శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని సంఘమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. అర్చకులు అప్పె నాగార్జున శర్మ భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు.

ప్రజాదరణ ఓర్వలేకే విమర్శలు

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేశ్ యాదవ్ అన్నారు. చెన్నారావుపేటలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత మగ్దుంపురంలో పోచమ్మ బోనాలకు హాజరైన కవిత రైతుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ముందు చూపు లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉచితంగా యూరియా ఇస్తామని గత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూరియా కొరత లేకుండా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే దమ్ము లేక సీఎంపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● బీజేపీ కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నెక్కొండ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పార్టీ తరఫున బరిలో నిలిచే వారిని గెలిపించేలా బూత్ స్థాయి నుంచి మండల కమిటీ వరకు ప్రతీఒక్కరు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు అనూష అశోక్, ఉపాధ్యక్షులు దామరచర్ల రామారావు, సూదనపు సారయ్య, ప్రధాన కార్యదర్శి రాంపల్లి రాజగోపాల్, కార్యదర్శులు సూత్రపు శ్రీను, మల్లం మల్లేశం, నాయకులు శ్రీరంగం శ్రీనివాస్, సింగారపు సురేశ్, పింగిళి మోహన్‌రెడ్డి, లావుడ్య శ్రీనివాస్, కుడికాల సుధీర్, రాజు, వెంకన్న, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి జీపీ నిధులు కేటాయించొద్దు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల బస్టాండ్ నుంచి అంగడి వరకు రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు కేటాయించొద్దని కొమ్మాల గ్రామస్తులు సోమవారం తీర్మానించారు. ఇటీవల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అంగడి వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా కొమ్మాల అంగడి ఆదాయం నుంచి గ్రామాలకు వచ్చే వాటా నుంచి కలిపి రూ.52 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. కాగా విశ్వనాథపురం మినహా మిగతా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. కొమ్మాలలో రూ.20 లక్షల కేటాయింపుపై సోమవారం గ్రామ సభ నిర్వహించగా గ్రామస్తులు వ్యతిరేకించారు. నిధులు మంజూరు కాని పరిస్థితిలో ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణం పనులకు ఎలా శంకుస్థాపన చేస్తారని గొడవ చేశారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సంగెం : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. పరకాలలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేపట్టిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో కేటీఆర్ అనుచిత, అహంకార పూరిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, కేటీఆర్ వాస్తవాలను విస్మరించి యూరియాపై చేసిన వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. నల్లబెల్లి సొసైటీలో యూరియా అక్రమ రవాణను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని గుర్తుచేశారు. ప్రమేయం లేకున్నా మహిళా రైతుపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టినట్లు, జైలుకు తరలించినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎఫ్ఐఆర్ పరిశీలించాలని హితవు పలికారు. కాంగ్రెస్‌ను, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని బద్నాం చేసేలా వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాగరాజు, నర్సింహనాయక్, నాయకులు కిశోర్, రవి, జగన్నాథచారి, కవిత, రాజు, పాషా, అంజన్‌రావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తేజావత్ బిచ్చ నాయక్, గుట్టయ్య, అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షులుగా నర్సింహస్వామి, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రవి, సహాయ కార్యదర్శిగా సోమయ్య, కోశాధికారిగా వెంకన్న, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా సంజీవ, శరత్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ముస్తఫా, మాజీ ఎంపీటీసీ విజాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ మెకానిక్స్ సంఘం కమిటీ..

వర్ధన్నపేట : పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మోటర్ మెకానిక్స్ పరపతి సంఘం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుక్కల సంపత్, ఉపాధ్యక్షులుగా భాను, బాలాజీ, కోశాధికారిగా రామగిరి ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీకి బాధ్యులు ఎన్నిక పత్రం అందజేశారు. కమిటీని సభ్యులు అభినందించారు.

బాధితురాలికి ఇల్లు మంజూరు చేయిస్తాం

● కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

నర్సంపేట : వర్షాల కారణంగా చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డతండాకు చెందిన భూక్య బిబ్లీ ఇల్లు నేలకూలిన క్రమంలో బాధితురాలికి ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, లింగాపురం మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్ భరోసా ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బాధితురాలి ఇంటిని రమేశ్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. వర్షాలకు మండలంలోని పలువురు పేదల ఇళ్లు కూలిపోయాయని చెప్పారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే చొరవతో అధికారులు త్వరలోనే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని తెలిపారు. బాధితురాలిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల మల్లారెడ్డి, జీడిగడ్డతండా గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులోతు బొంద్యాలు, నాయకులు సూదన్‌రెడ్డి, భిక్షపతి, గుగులోతు శ్రీను, భూక్య శ్రీను, గుగులోతు లచ్చిరాం, గుగులోతు వీరస్వామి, భూక్య రాములు, గుగులోతు హరి, గుగులోతు నర్సింహ, నూనావత్ విష్ణు, నూనావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, తదితరులు

నర్సంపేట రూరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలో నర్సంపేటలోని బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థులను చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు. పోటీల్లో స్కూల్ నుంచి 17 మంది వివిధ విభాగాల్లో బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారని చెప్పారు. ఉపాధ్యాయులు భవానీచంద్, పార్వతి, వినోద్, గోపీ, సతీశ్, అరుంధతి, రాజీవ్‌లను అభినందించారు.

అవగాహనతోనే ఓటు సద్వినియోగం

● మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత

ఖానాపురం : విద్యార్థులకు అవగాహన ఉంటేనే ఓటు సద్వినియోగం చేసుకోగలరని బుధరావుపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పెరక సునీత తెలిపారు. స్కూల్‌లో సోమవారం హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కల్చరల్ కమిటీ, డిసిప్లిన్ కమిటీ, స్పోర్ట్స్ కమిటీ, తదితర విభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నామినేషన్ దాఖలు చేయడంతోపాటు ప్రచారాలు నిర్వహించారు. పోలింగ్ ఆఫీసర్లు, బూత్ ఏజెంట్లు, కౌంటింగ్ వంటి కార్యక్రలాపాలు చేపట్టారు. విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలను బోధించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాసుల రవికుమార్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేసినట్టు గుర్తు చూపుతున్న విద్యార్థులు

జీవితంలో విద్యార్థి దశ కీలకం

● ఎస్సై ప్రవీణ్

పర్వతగిరి : జీవితంలో విద్యార్థి దశ కీలకమని ఎస్సై ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్/కాలేజీలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. గంజాయి, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, తదితరాల గురించి వివరించారు. అనంతరం గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎంఈఓ, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్

స్కాలర్‌షిప్ బకాయిల విడుదలలో నిర్లక్ష్యం



అమరవీరుల స్తూపం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

● ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సుజిత్

నర్సంపేట : విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ విమర్శించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేస్తోందని తెలిపారు. ప్రభుత్వ మోసపూరిత విధానంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇచ్చే నెపంతో విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి తదనంతరం విస్మరించిన ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ భానోతు శ్రావణ్‌కుమార్, నాయకులు సంతోశ్, సిద్ధూ, గణేశ్, యాకూబ్, శ్రీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

పర్వతగిరి: మండలంలోని గుంటూరుపల్లికి చెందిన పామునూరి లక్ష్మీనారాయణ సర్వే నంబర్ 838 లోని భూమిపై చేయించుకున్న అక్రమ పట్టాను రద్దు చేయాలని కోరుతూ బాధిత దళితులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మీడియాకు వివరాలు వెల్లడించారు. సర్వే నంబర్ 838లోని 12.03 ఎకరాల ప్రభుత్వ భూమిని దశాబ్దాల క్రితం దళితులకు నాటి ప్రభుత్వం కేటాయించి పట్టాలిచ్చిందని చెప్పారు. కాగా లక్ష్మీనారాయణ కొందరు అధికారులను మచ్చిక చేసుకుని అక్రమంగా పట్టా చేయించుకున్నారని చెప్పారు. లక్ష్మీనారాయణను, అతనికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యాకమ్మ, కొమురమ్మ, కనకలక్ష్మి, పద్మ, ముత్తమ్మ, కవిత, రామక్క, జగదాంబ, ఐలమ్మ, మల్లమ్మ ఉన్నారు.